# హద్దులు దాటితే పార్టీలో ఉపేక్షించేది లేదు

## మెదక్ కాంగ్రెస్ ఖిల్లాగా మారుతుంది సందేహం లేదు.

- కార్యకర్తల ఆవేదనను అర్థం చేసుకుంటాము.
- కష్టపడ్డ కార్యకర్తలకే సొసైటీ లో పదవులు.
- 2002 కండిషన్ పేరుతో ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతుంది.
- అర్హత కలిగిన ప్రతి పేదవాడి ఓటు కాపాడటం కోసం సర్ ప్రక్రియ.
- మార్కెట్, సొసైటీ, టెంపుల్, లైబ్రరీ పదవుల్లో పాతవారికి మొదటి ప్రాధాన్యత.
- ఎంపీ రఘునందన్ రావు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చింది?
- ఉద్యోగాల ఇచ్చుడేమో కానీ! ఉన్న ఉద్యోగాలు ఉడగొట్టే పరిస్థితి.
- జెన్ జీ ఉద్యమం మోడీకి చెంపపెట్టు.
- ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన మోదీ ఇంటికే.
- ఫామ్ హౌస్ కే పరిమితమైన కేసీఆర్.అసెంబ్లీకి రాని మీకు ప్రతిపక్ష హోదా ఎందుకు.?
- సోషల్ మీడియా లో అసత్యాలు ప్రచారమే పనిగా పెట్టుకున్న కేటీఆర్.
- కత్తి పట్టుకున్నాడు కత్తి పోటుకు పోయినట్లు ..సోషల్ మీడియాను నమ్ముకున్న కేటీఆర్ అదే గాల్లో కొట్టుకుపోతాడు.
- మెదక్ జిల్లాలో దోపిడీ చేసిన హరీష్ రావు ను మర్చిపోరు.
- కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు.
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.



మెదక్ ఆగష్టు,24(సిరి న్యూస్)

పార్టీ లైన్ దాటితే ఇంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.సోమవారం మెదక్ పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి మెదక్ పీసీసీ సమావేశం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు , డీసీసీ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, మాజీ మంత్రి చంద్రశేఖర్ రావు,ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా టీపీసీసీ మహేష్‌కుమార్ గౌడ్, దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ..కార్యకర్తల ఆవేదనను అర్థం చేసుకుంటామని, మెదక్ కాంగ్రెస్‌కు కంచుకోటగా మారడం ఖాయమన్నారు. అర్హులైన పేదల ఓటు హక్కును కాపాడేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియలో కృషి చేశామని తెలిపారు. నోటీసులు అందిన వారు వివరాలు సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన పాత, సీనియర్ నాయకులకు మార్కెట్, సొసైటీ, ఆలయ, లైబ్రరీ తదితర పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని,70 శాతానికి పైగా పదవులు పార్టీని నమ్ముకున్న పాతవారికే దక్కేలా చూస్తామన్నారు.

### కేంద్రంలో బీజేపీ విఫలం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో విఫలమైందని విమర్శించారు. మతం, కులం పేరుతో రాజకీయాలను ప్రజలు నమ్మడం లేదని, యువత ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తోందన్నారు. ఫామ్ హౌస్ కె పరిమితమైన కెసిఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. మెదక్ జిల్లాలో దోపిడీ చేసిన హరీష్ రావు ప్రజలు ఇంకా మర్చిపోలేరని తేల్చి చెప్పారు.సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ 100 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు,ఇప్పటికే 3500 మంజూరు చేశామన్నారు.పేదలకు చేరువలో వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని, హద్దులు దాటి మాట్లాడితే పార్టీ ఉపేక్షించదని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు సంక్షేమ పథకాలతో ప్రజాపాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు మైనంపల్లి హన్మంతరావు,గాలి అనిల్ కుమార్, ఆవుల రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి,కాటా సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడిగా అమీర్ ఖాన్

- నియామక పత్రం అందజేసిన జనశక్తి మజ్దూర్ సభ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్

రామచంద్రపురం, ఆగస్టు 24 (సిరి న్యూస్) :

లోక్ జనశక్తి పార్టీ రామ్‌విలాస్ ఆధ్వర్యంలోని జనశక్తి మజ్దూర్ సభ సంగారెడ్డి జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడిగా మహమ్మద్ అమీర్ ఖాన్‌ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు అందుతున్న వేతనాలు వారి శ్రమకు తగిన విధంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాన్ని రూ.30 వేలకు సవరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మికులు లేకుండా ఏ సంస్థ ముందుకు సాగదని, కార్మికుల కృషితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి అమీర్ ఖాన్ కృషి చేయాలని సురేందర్ పిలుపునిచ్చారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అమీర్ ఖాన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌కు, తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు




తెలిపారు. తనకు అప్పగించిన పదవికి న్యాయం చేస్తూ జిల్లా వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# పరిశ్రమల సహకారంతో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట





- సిఎస్ఆర్ నిధులతో మౌలిక వసతుల కల్పనకు కృషి
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

గుమ్మడిదల, ఆగస్టు 24 (సిరి న్యూస్ ):

పరిశ్రమల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం గుమ్మడిదల పురపాలక సంఘం కేంద్రంతో పాటు వీరన్నగూడెం, గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు కేవలం ఉత్పత్తి, ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా తాము కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతాల అభివృద్ధిలో కూడా భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. సీఎస్ఆర్ నిధులను గ్రామాల అభివృద్ధికి సద్వినియోగం చేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులకు తోడు పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు అందుబాటులోకి రావడంతో గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అన్ని రకాల మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని అన్నారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం, స్థానికులకు ఉపాధి లభిస్తున్న నేపథ్యంలో ఆయా సంస్థల సీఎస్ఆర్ నిధుల ద్వారా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి మరింత సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుమ్మడిదల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, పరిశ్రమలు, ప్రజలు కలిసి పని చేసినప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య, కమిషనర్ దశరథ, కౌన్సిలర్లు మాధవి, పద్మ, గౌసియా, చక్రపాణి, కుమార్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు సద్ది విజయ భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, పొన్నబోయిన వేణు, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిఎన్ ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం..

### కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



రామచంద్రాపురం, ఆగస్టు 24 (సిరి న్యూస్) :

శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పిఎన్ ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కురుమ ప్రారంభించారు. స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బూరుగడ్డ పుష్పనగేష్ కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ లో అర్ధరాత్రి దారిదోపిడీ..

### ఏడుగురిని పట్టుకున్న కొల్లూరు పోలీసులు

రామచంద్రపురం, ఆగస్టు 24 (సిరి న్యూస్) :

తెల్లాపూర్‌లో అర్ధరాత్రి దారిదోపిడీకి పాల్పడిన ఏడుగురు నిందితులను కొల్లూరు పోలీసులు పట్టుకున్నారు. మూడు బైకులపై వచ్చిన తొమ్మిది మంది ఓ వ్యక్తిని అడ్డగించి దాడి చేసి, అతడి వద్ద ఉన్న రూ.4,700 నగదు లాక్కొని పరారయ్యారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడుగురిని గుర్తించి పట్టుకోగా, వారిలో నలుగురు మైనర్లు ఉన్నట్లు వెల్లడైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 21న అర్ధరాత్రి నలగండ్లలోని సమోసా రెస్టారెంట్‌లో పని ముగించుకున్న మహేష్ అంబేద్కర్ కాలనీలోని తన గదికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తెల్లాపూర్‌లోని ఎస్‌ఆర్ స్విమ్మింగ్ పూల్ వద్దకు చేరుకోగా, మూడు బైకులపై వచ్చిన తొమ్మిది మంది అతడిని అడ్డగించారు. అనంతరం మహేష్‌పై చేతులతో దాడి చేసి, అతడి జేబులోని పర్సును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. పర్సులో రూ.4,700 నగదు ఉన్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఏడుగురు నిందితులను గుర్తించి పట్టుకున్నారు. వీరిలో సంకుల చంద్రు, ఎం. సంగమేష్, సిద్ధి రామ్ చరణ్ తేజ అలియాస్ చెర్రీ లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, మరో నలుగురు మైనర్లను జువెనైల్ హోమ్‌కు తరలించారు. ఘటనలో పాల్గొన్న మిగిలిన ఇద్దరు నిందితుల కోసం కొల్లూరు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి
- బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, ఆగస్టు 24 (సిరి న్యూస్):

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం క్రమం తప్పకుండా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ఈ సందర్భంగా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితుల సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లలో సమస్య పరిష్కారం కాని వారు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే ప్రజావాణికి రావచ్చని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని చట్టపరమైన పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

## 27న జిల్లా కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయండి.

వలిగొండ ఆగస్టు 24

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ (టీజీ జెఎసి) పిలుపుమేరకు 53/ పిట్ మెంట్ పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ 6డిఏలను విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని, కేజీబీవి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమం టైం స్కేల్ ను అమలు పరచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ యాదాద్రి భువనగిరి కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాను అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని టీజీఈ జేఏసీ కో చైర్మన్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య కోరారు. ఈ వలిగొండ మండలము లో జరిగిన సభ్యత్వ నమోదు అనంతరం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో టిఎస్ యుటిఎఫ్ వలిగొండ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు, కే వెంకటయ్య, టీ బిక్షపతి, అంబటి శ్రీనివాస్, కె. సైదారెడ్డి, పిశ్రీనివాస్, కె కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన పోస్టాఫీసుల్లో ప్రత్యేక రాఖీ బుకింగ్ కౌంటర్లు

### రాఖీలను ముందుగానే బుక్ చేసుకోవాలి: సహాయ సంచాలకులు ఆర్. సత్యనారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 24** : రాఖీ పండుగ సందర్భంగా రాఖీలను దేశవ్యాప్తంగా, విదేశాలకు సకాలంలో చేరవేసేందుకు హైదరాబాద్ ప్రధాన కార్యాలయ ప్రాంత తపాలా శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. జంట నగరాలు, పరిసర డివిజన్లలోని ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో ప్రత్యేక రాఖీ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు సహాయ సంచాలకులు–II (ప్రధాన కార్యాలయ ప్రాంతం) ఆర్. సత్యనారాయణ తెలిపారు. రాఖీ మెయిల్‌ను సకాలంలో పంపించడంతో పాటు సజావుగా డెలివరీ చేసేందుకు ఈ ప్రత్యేక కౌంటర్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిన పోస్టాఫీసుల వివరాలను జతపరిచినట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలకు కూడా రాఖీలు సకాలంలో చేరేలా వినియోగదారులు ఈ ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకొని, రాఖీ తపాలా వస్తువులను ముందుగానే బుక్ చేసుకోవాలని ఆర్. సత్యనారాయణ కోరారు.

## భూముల వేలం రద్దు చేయాలి: ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్/కూకట్‌పల్లి, ఆగస్టు 24** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూములను వేలం వేయడాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2న నిర్వహించనున్న వేలాన్ని రద్దు చేయాలని కోరారు. హౌసింగ్ బోర్డు పేద, మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ఏర్పాటైందని, భూములను విక్రయించి వ్యాపారం చేయడానికి కాదన్నారు. కూకట్‌పల్లిలో ఖాళీ స్థలాలను పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రులు, కమ్యూనిటీ హాళ్లకు కేటాయించాలని సూచించారు. ఎల్లమ్మబండ–షంషీగూడ, హానర్ హోమ్స్ భూముల వ్యవహారాలపై విచారణ జరిపి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 22–ఏ, అర్బన్ సీలింగ్ భూముల విషయంలో ప్రభుత్వం పేదలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. భూకబ్జాలను అరికట్టలేకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ఈటల డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తుల విక్రయాన్ని ఆపకపోతే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్ పై బీజేపీవి రాజకీయ డ్రామాలు: మంత్రి పొన్నం

**చిగురుమామిడి/నవాబ్‌పేట, ఆగస్టు 24** ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ చేస్తున్న దీక్షలు రాజకీయ డ్రామాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. నవాబ్‌పేటలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తన రాజకీయ ఉనికి కోసమే దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీ నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన ఫీజు బకాయిలను తమ ప్రభుత్వం చెల్లిస్తోందని, ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని పొన్నం పేర్కొన్నారు.

## చిరుతపులి చర్మం, గోర్ల విక్రయ యత్నం.. నలుగురు అరెస్ట్




**కొత్తగూడెం, ఆగస్టు 24** చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురిని బూర్గంపహాడ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఒక చిరుతపులి చర్మం, 17 గోర్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. గత వేసవిలో చింతూరు మండలం గమ్మలకోట అటవీ ప్రాంతంలో గుంతలో చిక్కుకున్న చిరుతను చంపి, దాని చర్మం, గోర్లను భద్రపరిచినట్లు విచారణలో వెల్లడైంది. వాటిని తాళ్లగొమ్మూరులో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు నలుగురిని పట్టుకున్నారు.

## అత్యాధునిక శస్త్రచికిత్సతో రెండేళ్ల బాలికకు మూర్ఛల నుంచి విముక్తి

**హైదరాబాద్, ఆగస్టు 24** మందులతో నియంత్రణలోకి రాని తీవ్రమైన మూర్ఛవ్యాధితో బాధపడుతున్న భువనగిరికి చెందిన రెండేళ్ల వాగ్దేవికి సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వైద్యులు అత్యాధునిక మెదడు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. MRI, PET–CT పరీక్షల్లో మూర్ఛలకు కారణమైన మెదడులోని అసాధారణ కణజాలాన్ని గుర్తించి తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం మూర్ఛలు పూర్తిగా నిలిచిపోయాయని, బాలిక ఆరోగ్యంగా ఉండటంతో వారం రోజుల్లో డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

## తెలంగాణపై కేంద్రం వివక్ష: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 24** తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడులు, విద్య, క్రీడల రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంపొందించే లక్ష్యంతో చేపట్టాలనుకున్న తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం రాజకీయ వివక్షేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అందించామని, ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతించి అమెరికా పర్యటనను రాజకీయ కారణాలతో తిరస్కరించారని సీఎం పేర్కొన్నారు. ఆ రాజకీయ కారణాలేమిటో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడాలో పర్యటించేందుకు గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతి ఇచ్చిన కేంద్రం, ★'తెలంగాణ రైజింగ్–2047'★లో భాగంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి చేపట్టే అమెరికా పర్యటనను అడ్డుకోవడం వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. ఇది తనకు వ్యక్తిగతంగా జరిగిన అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి అధికారిక పర్యటనను అడ్డుకోవడం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావిస్తారని తెలిపారు.

## చురుకుగా సాగుతున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు

- పంచాయతీ నిధులతో అసంపూర్తి భవనానికి మోక్షం
- ముఖద్వారం ఏర్పాటు

**గుమ్మడిదల, ఆగస్టు 24 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా అర్ధాంతరంగా నిలిచిపోయిన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు మళ్లీ చురుకుగా కొనసాగుతున్నాయి. నిధుల కొరత కారణంగా భవన నిర్మాణం స్లాబ్ దశలోనే నిలిచిపోవడంతో ఇంతకాలం పంచాయతీ కార్యకలాపాలను తాత్కాలికంగా బీసీ కమిటీ భవనంలోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పంచాయతీ పరిపాలనకు, సిబ్బంది విధుల నిర్వహణకు పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. నూతన పాలకవర్గం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం పంచాయతీ నిధులతో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను చేపట్టి వేగంగా పూర్తి చేస్తున్నారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని గ్రామ సర్పంచ్ కొత్తకొండ భాస్కర్ తెలిపారు. పంచాయతీ భవనం పూర్తయితే గ్రామ పరిపాలనకు శాశ్వత వసతి కలగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మంబాపూర్ గ్రామపంచాయతీ భవనానికి సోమవారం ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. భవన నిర్మాణ పనులు తుది దశకు



చేరుకుంటున్న నేపథ్యంలో ముఖద్వారం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు కొత్తపేట కృష్ణ, మల్లెపల్లి యాదమ్మ, శ్రీశైలం, కొండని లీలావతి, ఆగేష్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది రాజంపేట ఆంజనేయులు, నర్సింగరావు, నల్లవల్లి మహేష్, కొత్తపేట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి





- క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి.
- క్రిటికల్ కేర్ బ్లాక్ ను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.

**మెదక్ ఆగష్టు,24(సిరి న్యూస్)**

క్రిటికల్ కేర్ బ్లాక్ ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రం లోని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ ను స్థానిక శాసన సభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారితో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై జీ జీ హెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా నితిన్ కబ్రా, డిఎంహెచ్ఓ డా. జ్ఞానేశ్వర్,డిసిహెచ్ఎస్ డా. శివ దయాళ్, వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హనుమంత రావు గార్లు పాల్గొన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన హెచ్ ఆర్ ఎక్విప్మెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్,సేవలను అందుబాటులోకి తేవడం పై ఈ నెల 25న హైదరాబాద్ సచివాలయం లో ఉన్నత స్థాయి సమావేశం కు రావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అలాగే, GGH ఆసుపత్రి లో వైద్య సేవల బలోపేతం పై మంత్రి చర్చించారు. GGH నూతన భవన నిర్మాణం పై చర్చించారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం పై చర్చించారు. తూప్రాన్ లో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ లలో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవలపై చర్చించారు. మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.



## పీపీ వెంకటేష్ బలమైన వాదనలతో నిందితుడికి జీవిత ఖైదు!

- ప్రాసిక్యూషన్ తరపున అద్భుతంగా వాదించిన వెంకటేష్.
- పకడ్బందీ దర్యాప్తు.. బలమైన సాక్ష్యాధారాలతో నేరం రుజువు.
- హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు.. రూ.5 వేల జరిమానా.
- పోలీసు అధికారులను సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.




శ్రీనివాసరావు.

**మెదక్ ఆగష్టు,24(సిరి న్యూస్)**

మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించడం, పోలీసులు పకడ్బందీగా సాక్ష్యాధారాలను సమర్పించడంతో నిందితుడికి జీవిత ఖైదు ఖరారైంది. మెదక్ జిల్లా ప్రధాన న్యాయస్థానం నిందితుడు పుట్టి ఆంజనేయులుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ ప్రాసిక్యూషన్ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించి, దర్యాప్తులో లభించిన సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు బలంగా ప్రతిపాదించారు. సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలు, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన లక్ష్మణ్ హత్యకు సంబంధించి మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు 2025 అక్టోబర్ 1న అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేశారు. అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ అర్షద్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందించారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలి

- విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలి
- ఈగల్ ఫోర్స్ ఎస్పీ రఘువీర్
- సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై సమీక్షా సమావేశం

**సంగారెడ్డి, ఆగస్టు 24 (సిరి న్యూస్):**




సంగారెడ్డి జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని ఈగల్ ఫోర్స్ ఎస్పీ రఘువీర్ పిలుపునిచ్చారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అధ్యక్షతన ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తులో పురోగతి, మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ ఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ముఖ్యంగా యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు, ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని, విద్యాసంస్థలను డ్రగ్స్ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లాలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఎలాంటి పెండింగ్ లేకుండా 1485 కిలోల గంజాయి, 5 కేజీల ఆల్ప్రాజోలం ధ్వంస ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన సంగారెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఈగల్ ఫోర్స్ డీఎస్పీ పుష్పన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రామ్ నాయక్, వివిధ డివిజన్ల డీఎస్పీలు సత్యయ్య గౌడ్, సైదా నాయక్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్–న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పీఎస్‌లో కొత్త నాయకత్వం..





- 10, 24వ డివిజన్లకు నూతన కమిటీలు..
- జీవన్, అశోక్‌లకు కీలక బాధ్యతలు..
- బాధ్యతలు స్వీకరించిన నూతన నాయకత్వం..
- భవిష్యత్ ఉద్యమాల బలోపేతమే లక్ష్యం..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 24 (సిరి న్యూస్)**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి భవిష్యత్ ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 10వ, 24వ డివిజన్లకు నూతన కమిటీలను ఏర్పాటు చేసింది. డివిజన్ స్థాయిలో సమితిని మరింత పటిష్టం చేసి, ప్రజా సమస్యలు, సామాజిక హక్కుల కోసం ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త కమిటీలను ఎన్నుకున్నారు. నస్పూర్ మండల బాధ్యులు గద్దల బానయ్య, బచ్చల రమేష్, గుంపుల స్వామి, కొయ్యల శేఖర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. 10వ డివిజన్ నూతన కమిటీలో అధ్యక్షుడిగా కొయ్యల జీవన్, ప్రధాన కార్యదర్శిగా ఎక్కటూరి సన్నీ, ఉపాధ్య క్షులుగా గుడిసెల ప్రవీణ్‌కుమార్, ఇదునూరి శరత్‌లను నియమించారు. 24వ డివిజన్ నూతన కమిటీలో అధ్యక్షుడిగా ఎల్కటూరి అశోక్, ప్రధాన కార్యదర్శిగా అట్కపురం రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అట్కపురం శ్రీనివాస్, అట్కపురం రాయలింగు, అట్కపురం సాగర్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు సమితి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, భవిష్యత్ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించాలని నిర్వాహకులు సూచించారు. డివిజన్ స్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేయడం ద్వారా సమితి కార్యక లాపాలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు నక్క అంజన్న, ఇరికిల్ల పురుషోత్తం, మాడుగుల రాజం, కొయ్యల వెంకటి, ఇరికిల్ల లింగయ్య, ఎక్కటూరి రాయలింగు, ఇరికిల్ల స్వామి, బచ్చల తిరుపతి, కొయ్యల భూమయ్య, ఇరికిల్ల శ్రీకాంత్, మాడుగుల సాగర్ తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీల ఎన్నికతో డివిజన్లలో సమితి ఉద్యమాలకు మరింత ఊపునిచ్చేలా నాయకత్వం సిద్ధమైంది.

# కక్కుర్తికి కళ్లెం.. లంచం డీల్ బెడిసింది..

- రూ.50 వేల లంచం తీసుకుంటూ పట్టుబాటు..
- గోదావరి, మంత్రి సాయి కృష్ణ అరెస్టు..
- పన్ను తగ్గించేందుకు లంచం డిమాండ్..
- వాణిజ్య పన్నుల శాఖలో కలకలం..

**ఉమ్మడి అదిలాబాద్ ప్రతినిధి ఆగస్టు 24 (సిరి న్యూస్)**



నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ దాడులు కలకలం రేపాయి. పన్ను మొత్తాన్ని తగ్గించేందుకు వ్యాపారి నుంచి లంచం డిమాండ్ చేసిన ఇద్దరు అధికారులు ఏసీబీ పన్నిన వలలో చిక్కుకున్నారు. రూ.50 వేల లంచం తీసు కుంటుండగా ఉప వాణిజ్య పన్నుల అధికారి గోదావరి, సీనియర్ సహాయకుడు మంత్రి సాయి కృష్ణను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఓ వ్యాపారికి సంబంధించిన పన్ను మొత్తాన్ని తగ్గించేందుకు అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని బాధిత వ్యాపారి అవినీతి నిరోధక శాఖ అధికా రులను సంప్రదించాడు. ఫిర్యాదును స్వీకరించిన అధికారులు విషయాన్ని పక్కాగా పరిశీలించి, అనంతరం వల పన్నారు. అధికారుల సూచనల మేరకు బాధిత వ్యాపారి లంచం మొత్తాన్ని అందజే స్తుండగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. రూ.50 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో గోదావరి, మంత్రి సాయి కృష్ణను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖలోనే పన్ను తగ్గించేందుకు లంచం డిమాండ్ చేసి చివరకు అదే కార్యాలయంలో ఏసీబీకి చిక్కడం చర్చనీ యాంశంగా మారింది. ఈ ఘటనతో కార్యాలయ సిబ్బందిలో ఒక్కసారిగా కలకలం నెలకొంది. అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం డిమాండ్‌కు దారితీసిన పరిస్థితులు, వ్యవహారంలో మరెవరైనా పాత్ర ఉందా అనే కోణంలో వివరాలు సేకరి స్తున్నారు. లంచం డిమాండ్‌పై వచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని పక్కా ప్రణాళికతో ఆపరేషన్ నిర్వహించి ఇద్దరిని పట్టుకోవడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. కేసుకు సంబంధించిన తదుపరి చట్టపరమైన చర్యలను అవినీతి నిరోధక శాఖ అధికారులు చేపడుతున్నారు.

# పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌కు అభినందనలు

**మెదక్ ఆగస్టు 24 సిరి న్యూస్**

మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను పాపన్నపేట మండలం అన్నారం గ్రామానికి చెందిన పేదలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ అసోసియేషన్‌లో కీలక బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌గౌడ్ పోలీసు సిబ్బంది సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. పోలీసు సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తనను అభినందించేందుకు వచ్చిన అన్నారం గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.




# బాల్యం బలపడితేనే భవిష్యత్తు బలపడుతుంది..

- చదువుతో పాటు విలువలు నేర్పితేనే విద్యార్థులకు భవిష్యత్తు---డా.అనితారెడ్డి
- మొబైల్ కు దూరంగా.. విలువలకు దగ్గరగా పిల్లల పెంపకం ఉండాలి
- పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం



**వరంగల్, ఆగస్టు 24** : విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, భద్రత, నైతిక విలువల పెంపొందింపులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో కీలకమని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డా.అనితారెడ్డి అన్నారు. వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డా. అనితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డా. అనితారెడ్డి మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఇంట్లోనే కాకుండా పాఠశాలలోనూ ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. చిన్ననాటి నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, మంచి–చెడుల మధ్య తేడాను గుర్తించడం వంటి అంశాలను పిల్లలకు నేర్పించాలన్నారు. పిల్లలతో తల్లిదండ్రులు నిత్యం కొంత సమయం గడుపుతూ వారి ఆలోచనలు, సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. పిల్లల స్నేహ సంబంధాలపై కూడా తల్లిదండ్రులు దృష్టి సారించాలని, వారి భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి స్నేహాలను ప్రోత్సహించాలని సూచించారు. మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తల్లిదండ్రులు నియంత్రించాలని, అవసరానికి మించి పిల్లలకు ఫోన్లు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించి, వారు అందించే సూచనలను పాటించాలని, పెద్దలు బోధించే మంచి నైతిక విలువలను తమ జీవితంలో ఆచరించాలని డా. అనితారెడ్డి సూచించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

### మున్సిపల్ చెర్మెన్ నాగులపల్లి నరేందర్, కమిషనర్ నాగరాజు



**కోస్గి మున్సిపల్, ఆగస్టు 24** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజక వర్గంలోని కోస్గి మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్ ,మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించారు.ఈ కార్యక్రమంలో డీలర్ ఆనంద్,ఏడవ వార్డు కౌన్సిలర్ తుడుం శ్రీనివాస్ కోస్గి మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అబ్దుల్ సలీమ్, మేనేజర్ అనిల్, కోస్గి మార్కెట్ కమిటీ డైరెక్టర్ హాజీ కాంగ్రెస్ పార్టీ నాయకులు గండీడ్ సూరి, బాలేష్, వెంకట్, రామకృష్ణ, మల్లేష్, రాజు, బిలాల్ ,మరియు కాలనీవాసులు పాల్గొన్నారు..

## భారీ వర్షా ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి:

### కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, ఆగస్టు 24** : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మెదక్ జిల్లా ఎల్లో అలర్ట్‌లో ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, వరద ప్రభావిత రహదారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. శిథిల భవనాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం, నీరు నిలిచే ప్రాంతాల్లో డీవాటరింగ్ చర్యలు చేపట్టడం, మ్యాన్‌హోళ్లు, ప్రమాదకర ప్రాంతాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి క్లోరినేషన్, ఫాగింగ్ చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి: TGHRC

**హైదరాబాద్, ఆగస్టు 24** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (TGHRC) సిఫారసు చేసింది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర వసతులు లేక విద్యార్థులు చెట్ల కింద, వరండాలు, కమ్యూనిటీ భవనాల్లో చదువుతున్నారనే పత్రికా కథనం ఆధారంగా కమిషన్ HRC No.2638 of 2026ను సుమోటోగా స్వీకరించింది. కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల విద్యాశాఖ అధికారుల నివేదికలను పరిశీలించగా, పలు పాఠశాలల్లో శిథిలావస్థలోని తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన భవనాలు, మరుగుదొడ్ల కొరత ఉన్నట్లు వెల్లడైంది. ఆర్టికల్ 21A కింద విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశానికే పరిమితం కాదని, విద్యార్థులు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో చదువుకునే పరిస్థితులు కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులపై నివేదికలు తెప్పించి, అవసరమైన మరమ్మతులు, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించింది. కమిషన్ సిఫారసులపై తీసుకున్న లేదా ప్రతిపాదించిన చర్యల వివరాలను ఆరు నెలల్లోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ కేసులో తదుపరి చర్యలను ముగించింది.

## సరిహద్దు వివాదంపై భారత్–చైనా కీలక చర్చలు.. చైనాకు అజిత్ దోవల్



**న్యూఢిల్లీ, ఆగస్టు 24** భారత్–చైనా సరిహద్దు వివాద పరిష్కారానికి కొనసాగుతున్న ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో భాగంగా జాతీయ భద్రతా సలహాదారు (NSA) అజిత్ దోవల్ సోమవారం చైనాలో పర్యటించనున్నట్లు సమాచారం. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ఆయన సమావేశమై సరిహద్దు పరిస్థితులు, ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. 2003లో ప్రారంభమైన ప్రత్యేక ప్రతినిధుల వ్యవస్థలో ఇది 25వ విడత చర్చలు. 3,488 కిలోమీటర్ల సరిహద్దు వివాదానికి పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కార మార్గాన్ని రూపొందించడం ఈ చర్చల ప్రధాన లక్ష్యం. 2020 నుంచి 2024 వరకు లద్దాఖ్‌లో నెలకొన్న సైనిక ఉద్రిక్తతలతో భారత్–చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో ప్రతిష్టంభన తొలగింపుపై అవగాహనకు వచ్చిన అనంతరం ఇరు దేశాలు సంబంధాల సాధారణీకరణకు చర్యలు చేపట్టాయి. కైలాస్ మానససరోవర్ యాత్ర పునరుద్ధరణ, ప్రత్యక్ష విమాన సర్వీసులు, వీసా నిబంధనల సడలింపు వంటి అంశాల్లో పురోగతి సాధించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సరిహద్దులో శాంతి, ప్రశాంతత కొనసాగితేనే భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగుతాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల స్పష్టం చేశారు. గత ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలోనూ న్యాయమైన, సహేతుకమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన సరిహద్దు పరిష్కారానికి రాజకీయ దృక్పథంతో ముందుకు సాగాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.